



# సిడిమొయిలు

స.వెం. రమేశ్

ఉత్తూతి ఉత్తూతి... ఉత్తూతి ఉత్తూతి... అని కెరలతా పైకి లేచినాయి ఉత్తూతి గువ్వలు. తబిసిమాను మంచె మింద పండుకొని ఉండే చెన్నీరడు ఆ అరుపులకు ఉలిక్కిపడి లేచినాడు. 'చేనులోకి దొంగగొడ్డు దూరిందో దొంగే దూరినాడో,' అనుకొంటా "ఓహో... య్ సంపంగిరామా ఉండావారా," అంటా కూసినాడు. ఆ కూత చేనంతా తిరిగి కానంతా తిరిగి చిక్కటి చీకట్లు నిండిన అడివిలోకి దూరి చెవిమరుగు అయింది.

"ఉండాను ఉండాను చెన్నీరా," చేన్లకు అద్దరిన ఉండే జీవిమాను మంచె మింద నుంచి సంపంగి రాముడి గొంతు వినపడింది.

"మదనగిరి చేను తావున ఉత్తూతి గువ్వలు అరస్తా ఉండాయి చూడరా," తిరిగి కెరలినాడు చెన్నీరడు.

"ఓహో... య్ మదనగిరీ మేలుకొని ఉండావా లేదా రా," సంపంగిరాముడి కేక వడిగా పొయి జాలారి మాను మంచెమింది మదనగిరిని తాకింది.

"మేలుకొనే ఉండానురేయ్. మనుముల (జంతువుల) అలికిడి ఏదీలేదు, పామును చూసి కెర్లినట్లు ఉండాయి గువ్వలు," జాలారి మాను గుబురులో నుంచి మదనగిరి మాట కంగుమనింది.

ఆ మాట అయిపోగానే చేనంతా నిరుసద్దు అయిపోయింది. అడివిలో మటుకు తోటిగువ్వకు ఏమి ఎదురుపడిందో, 'తుట్టేటు తుట్టేటు,' అని అరస్తానే ఉండాది.

'అడివిలో ఏనుగుల గుంపో పందుల మందో మేపుకు కదిలినట్లు ఉండాది, లేకపోతే నోటికి బిడువు లేకుండా తోటిగువ్వ అట్ల కెర్లేది లేదు, కన్ను మూయకుండా కనిపెట్టుకొని ఉండాల,' అనుకొంటా పక్కన ఉండే పలకను తడిమి చూసుకొన్నాడు చెన్నీరడు.

ఆ అడివంచు మాదిగపల్లెలోని చెన్నీరడికి పెండ్లయి ఒక నెల అయింది అంతే. అడివికి ఇంకొక కొసన ఉండే మంచిగేరి అనే పల్లెటూరి పడుచును పెండ్లాడినాడు చెన్నీరడు. ఆ పడుచు పేరు సిరివన్నె. చినుకులకు పదునెక్కిన నల్లరేగడి వన్నెలో వుంటాది ఆ పడుచు. అది ఇరుల పెడ (క్రిష్ణపక్షం), రేపో మన్నాడో ఇరుల్నాడు (అమావాస్య). మిన్నంతా గబ్బు మబ్బు (చీకటి) అలముకొని ఉండాది. అంత చీకటిలోనూ చెన్నీరడు కళ్లు మూస్తే చాలు రెప్పలకింద తళుక్కుమని మెరుపయి మెరుస్తా ఉండాది సిరివన్నె. ఆ మెరుపును తట్టుకోలేక కళ్లు తెరిచినాడు. నీరెండలో నేరేడుపండు వన్నె జుట్టును గాలికి ఆరపెట్టుకొంటా నిలిచిన సిరివన్నె లాగా, నల్లని నీడలతో ఊగుతా ఉండే తబిసి కొమ్మలు కనపడినాయి వాడికళ్లకు.

ఇంక నిలువలేకపొయినాడు చెన్నీరడు. చేను తావు నుంచి వాడి ఇల్లు పది తాడుల (సుమారు 3 కిలో మీటర్లు) దవ్వులో ఉంటాది. మంచె దిగినాడు. దిగేటప్పుడు గుగ్గుగ్గుక్... అంటా గూబ ఒకటి వాడి తల మింద తన్నేసి పొయింది. చెన్నీరడు పట్టించుకోలేదు. దిగిన తరువాత అనిపించింది, పలకను సంకకు తగిలించుకొని తెచ్చుకొని ఉంటే బాగుండేది అని. మళ్లా మాను ఎక్కి పలకను తెచ్చుకొందామా అన్నట్లుగా మాను బుడము తట్టు ఒక అడుగు వేసినాడు. అంతలోనే

వద్దనుకొన్నాడేమో ఆ అడుగు వెనుకకు పడింది. ఏ గూట్లో గువ్వను నోట్లో పెట్టుకోను వచ్చిందో మానుపిల్లి 'మావ్‌' అంటా చెన్నీరడి కాళ్ల సందున దూరి పారిపొయింది. తత్తరపాటుతో చెన్నీరడి అడుగు తవన (క్షణం) పాటు తడపడింది.

'సీ ఏమి ఈ రావిడి,' అనుకొంటా తబిసిమానును దాటి, ఊరితట్టు అడుగులు వేసినాడు చెన్నీరడు. అడివిలో తోటిగువ్వ గోల ఎక్కువయింది. దాని గొంతు చేన్ల పక్కగా దగ్గరవుతా వస్తుండాది. బండిదడములో పోతే పది తాడుల దవ్వున ఉండే ఊరు, కాలిబాటన నడిస్తే ఏడు తాడుల దవ్వుకే ఎదురొస్తుంది. అందరూ ఎరిగిన బాటే అది. అంత తడవు కూడా ఓపలేని కోడెయాడు చేలకు అడ్డం పడింది. చెన్నీరడి ఒళ్లంతా వేకి (జ్వరం) తగిలినట్లు సలసల మరగతా ఉండాది. వాడి లోపలి నుంచి సెగల ఊపిరి పొగలయి వెలుపలకు వస్తా ఉండాది.

కట్టుకు వచ్చిన ఆవు పిలుపు విని ఆబగా పరుగెత్తే ఆపటెద్దు మాదిరిగా ఆరిక చేనుకు అడ్డంపడి పోతా ఉండాడు చెన్నీరడు. వాడు పోతుండే దోవకు అల్లంత దవ్వులో ముసుగుజొన్న సాలులో ముడుక్కొని పడుకోనుండాది ఆడతాచు. చెన్నీరడి వేడి ఊపిరి పొయి ఆ తాచుకు తగిలింది. అంతే దానికి ఒళ్లంతా సలపరం పుట్టేసింది. చివాల్న లేచి కొర్రచేనులో దూరి సద్దచేనును దాటి సామచేను మీదగా సాగి జొన్నచేనులో జోగతా ఉండే జెర్రిపోతు మింద పడింది.

చెన్నీరడు ఆరికచేనును దాటినాడు, బుడింగి బాయిని దాటినాడు, చిప్పట్లదడిని దాటినాడు, నాయి నోళ్ల బయలును దాటినాడు, పులి కొట్టిన మద్దిమానును దాటినాడు, కందిచేను గుంతలను దాటినాడు, మడిగుడ్ల దొనను దాటినాడు... అడ్డం వచ్చిన అన్నిటినీ దాటుకొని పోతా ఉండాడు. అల్లదిగో అది తంగిడి కుంట. ఆ కుంటలో నిండు వేసగిలో కూడా నీళ్లుంటాయి. కుంట చుట్టూ తంగిడి వబ్బలు (పొదలు) నిండిపొయి వుంటాయి.

ఆ వబ్బల్లో నుంచి చెన్నీరడిని చూసింది గుడ్లమీది నీళ్లకోడి. అంతే కొంపలు మునిగేటట్లు 'కెకో... కెకో... కెకో...' అంటా గొంతు చించుకొంటా ఉండాది. కుంటను దాటేస్తే సగం దవ్వు దాటేసినట్లే. అంత దవ్వు ఒక్క ఊపిరితో వచ్చిన చెన్నీరడు ఎందుకో టకీమని అక్కడ ఆగిపొయినాడు.

కుంటకు వక్కణపు (ఉత్తరం) పక్క అడివి, తెక్కణం (దక్షిణం)గా పోతే ఊరు. పడమరపక్క గుట్ట. తూరుపున అంతా చేనులు. కుంటకు ఈపక్క కెరకొడతా ఉండే నీళ్లకోడి కాదు చెన్నీరడి పరుగును ఆపింది, కుంటకు ఆ పక్క అందినంత దవ్వులోనే లబలబలబ నోరు కొట్టుకొంటా ఉండే తోటిగువ్వ అరువు వాడిని నిలబెట్టింది.

తన దోవకు అడ్డంపడి తన గూడుకు ముప్పు తెచ్చిన మనుము, అది ఎంత పెద్దది అయినా దానిని చానాసేపు వెంటపడి వెంటపడి అరిచి ఆగం చేసే ఎసలు (గుణం) తోటిగువ్వది. అడివి లోతట్టు నుంచి మెల్లగా చేన్ల పక్కకు వస్తా ఉండిన తోటిగువ్వ అరుపు, కుంటకు ఆ పక్కన నిలిచి పలకతా ఉండాది. అంటే అది వెంటాడతా ఉండే మనుము, ఈ తట్టు నుంచి రేగిన నీళ్లకోడి అరుపును విని ఆగినట్లు ఉండాది. ఎందుకో అరగలి (సందేహం) కలిగింది వాడికి, మెల్లిగా పక్కకి జరిగి ఆ పక్కనే ఉండే ఇప్పిమానును ఎక్కినాడు. నడి తమరలో ఒదిగి కూచున్నాడు. తనకు ముప్పు తప్పిందిలే అనుకొని నీళ్లకోడి అరుపు చాలించింది.

చెన్నీరడి చూపు చురుగ్గా కుంటకు వక్కణపు తట్టుకు సాగింది. ఆపక్క తోటి గువ్వ అరుపు కూడా అణిగింది. అడివిని దాటి బయటకు రాదు తోటిగువ్వ. అంటే తోటిగువ్వ వెంటపడిన మనుము అడివిని దాటింది. అంత చీకటిలోనూ చురుగ్గా చూస్తా ఉండాయి చెన్నీరడి కళ్లు. కొంచెంసేపటికి వాడి గుండె గుబేలుమనింది. ఆ పక్క నుంచి వస్తా ఉండేది ఒక్క మనుము కాదు, ఏనుగుల గుంపే వస్తా ఉండాది.

'నా కొడుకునియి, ఎపుడూ వచ్చే దోవలో మేము కాపు ఉండామని తెలుసుకొని ఈ దోవ పట్టిండాయే, ఇప్పుడు ఎట్లా, ఊర్లోకి పొయి ఊర్లోవాళ్లను లేపేది మేలా, వెనిక్కి తిరిగిపొయి మంచెలమింద కాపు ఉండే వాళ్లను తోడుకొని వచ్చేది మేలా,' రవంత పొద్దు ఏమీ తోచలేదు చెన్నీరడికి.

*

పెండ్లి అయినంక మూడేనాళ్లు పుట్టినింటిలో ఉండి, నాలుగోనాడు తెల్లవారి మొగునితో బయదేలి మాపుసరికి అడివిని దాటి అత్తింటికి చేరింది సిరివన్నె. కొత్త ఊరూ కొత్త చుట్టాలూ, దిగులు దిగులుగానే రెండు నాళ్లు గడిపింది. సిరివన్నె పుట్టిందీ మాదిగపల్లెలోనే మెట్టిందీ మాదిగపల్లెలోనే.

చెన్నీరడిని తొలిసారి పెండ్లిలోనే చూసింది సిరివన్నె. పెండ్లిచూపులూ ముందు మాటలూ ఎరగని అప్పటపు మాదిగపల్లెలు అవి. అమ్మా అబ్బా చెపితే

తలవంచి తాళి కట్టించుకొనే తీరులు వాళ్లవి. పెండ్లిలో తాళి కట్టేటపుడు కండలు తిరిగిన వాడి రెట్టలు కనపడి పొంగిపొయింది సిరివన్నె. వాడు బతుకంతా తోడు ఉంటాడనే తెంపుతో మెట్టి నింట అడుగుపెట్టింది. అందుకు తగ్గట్లుగానే చూసుకొంటా ఉండాడు పెండ్లాన్ని చెన్నీరడు. అమ్మా అబ్బా ఎడమయి పొయిన వాడికి ఇప్పుడు పెండ్లమే అన్నీ, అంతా.

ఈ ఊరికి వచ్చిన రెండోనాడే ఇరుగమ్మలు పొరుగమ్మలు వచ్చి పలుకరించి పొయినారు. మూడోనాడు నలుగురితోనూ కలిసి చెలమబాయికి నీళ్ల కోసం పొయి వచ్చింది సిరివన్నె. అంతే, అంతటితో ఆ పడుచు బెరుకు తీరిపొయింది. తను పుట్టి పెరిగిన పల్లెకూ ఈ పల్లెకూ వేరిమి ఏమీ కనపడలేదు సిరివన్నెకు. అట్లాంటి ఊరే అట్లాంటి నేలే అట్లాంటి మనుసులే అట్లాంటి పనులే... నాలుగోనాటికే ఆ పల్లెపడుచు అయిపొయింది సిరివన్నె.

సరయిన కొరతరి (మంచుకాలం) అది. ఆ తరిలోనే వెన్నులు విడిచిన పైర్ల పైన ఏనుగులు విరుచుకు పడుతాయి. ఏనుగుల బెడద చానా పెద్దది ఆ ఊరి వాళ్లకు. ఏడాదికి ఒకరో ఇద్దరో ఏనుగుల కాళ్లకింద పడి ఊపిరి వదిలేస్తుంటారు. పండిన చేనును కాపాడుకొనేందుకు వాళ్లు పడే తపన చెప్పను అలవికానిది. చేనుల్లోని పెద్ద పెద్ద మానుల మింద మంచెలు వేసుకొని రెయ్యంతా కాపుకాస్తా ఉంటారు. చేన్లకు రెండు పక్కలా అడివి ఉంటాది. ఆ అడివికీ చేన్లకీ నడుమ నూర్ల దోవలు ఉంటాయి. ఏ గుంపు ఎప్పుడు ఏ దోవన వస్తుందో ఎవరికీ తెలియదు. అందుకే అక్కడక్కడా మంచెలు వేసుకొని నాలుగుపక్కలా కాపలా కాస్తా ఉంటారు.

చెన్నీరడిది రెండు ఎకరాల చేను. రెండు ఎకరాలలోనూ రాగులు చల్లి, నడుమ నడుమ పది అడుగులకు ఒక సాలు పెట్టి, సాళ్లలో కందులూ అనుములూ అలసందలూ సాసువులూ (ఆవాలు) కొర్రలూ ఆరికలూ బరుగులూ (వరిగెలు) మిరపకాయలూ విత్తి, గనిమ అంచున యెర్నూగులు (వలిసెలు) విత్తిండాడు. చేనంతా వన్నె వన్నెల పూలతో వెన్నులతో కళకళలాడతా ఉండాది. ఇంకొక్క ముప్పయి నలబయి నాళ్లు ఎట్లో గాసిపడి కాపాడుకొంటే వెనకముందుగా అన్ని పంటలూ ఇల్లు చేరుతాయి. రెయ్యిపూట సిరివన్నెను విడిచి చేను తావుకు పోవాల అంటే చెన్నీరడికి చానా ఇక్కట్టుగా ఉండాది. అయినా తప్పదు కాబట్టి పోతా ఉండాడు.

మొగుళ్లు రెయ్యి ముద్ద తిని చేన్ల తావుకి పోతానే ఆ ఊరిలోని నాలుగిండ్ల ఇల్లాళ్లు ఒక తావున కూచుంటారు. అనపగింజలు పితుక్కొనే వాళ్లు పితుక్కొంటా ఉంటే, రాగులు విసురుకొనేవాళ్లు విసురుకొంటా ఉంటే, వక్కాకులు వేసుకొనేవాళ్లు వేసుకొంటా ఉంటే, పదాలు పాడేవాళ్లు పాడుతా ఉంటే, గుట్టుముచ్చట్లు చెప్పుకొని పగలపడి నగేవాళ్లు నగుతా ఉంటే... రెయ్యమ్మ కూడా ఒక ఇల్లాలై ఆ రవంత పొద్దు వాళ్లతో కలిసిపోతుంది. ఆ పొద్దూ అట్లే, కెంపక్క వాళ్ల పడసాల (వరండా)లో నలుగురు ఇల్లాళ్లూ కొలువు తీరినారు. కొత్త పెండ్లికూతురు సిరివన్నె కూడా ఆ గుంపులో ఉండాది.

''ఏలేయ్ సిరీ మా తమ్ముణ్ని చేను తావుకి అంపిచ్చేసి నువ్వు ఈడ ఆరాముగా కూకోనుండావా,'' కెంపమ్మ చెతుర్లాటకు తెరతీసింది.

''అవునాలేయ్ కెంపీ మీ తమ్ముడు ఏమీ ఎరగనోడు. మొన్న సవరేతిరిలో ఆవు లింట్లో ఏదో అలికిడి అయితే సూద్దామని లేసి ఇంట్లోనించి ఇవతలకు వస్తిని. అదే పొద్దుకు నీ తమ్ముడు ఆ తావున తిరుగాడతా నా కంట్లో పడినాడు. అదీ నీ తమ్ముడు చేను తావ కాసే కావిలి,'' నగతా అనింది ఓబమ్మ.

''నీకు ఇది తెలుసునా ఓబీ, నీ మరిది చెన్నీరప్పా, నీ చెల్లెలు సిరివన్నే కలిసి ఆవులు మేపేకి సంకురుని గవి తావుకు పోతా ఉండారంట. నట్టనడిపొద్దులో వీళ్ల ఆవులు గవి తావున మేస్తా ఉంటే మదనగిరన్న చూసొచ్చి చెప్పినాడు,'' మద్దూరమ్మ అనింది.

''మెలపు (జాగ్రత్త) మరదలా, సంకురుని గవిలో కరుడులు (ఎలుగుబంట్లు) ఉండాయంట. మా తమ్ముడు అనుకొని అవిటిని తబ్బు (కౌగలించు) కొనేవు,'' కెంపమ్మ మాటలకు అందరూ పడిపడి నగినారు. సిరివన్నె బుగ్గలు ఆ మబ్బులో కూడా మెరిసినాయి.

వీళ్ల మాటల్ని వింటా ఉండిన బాగిమాను మింద పైడిగువ్వకు ఈడొచ్చి పైన పడి, కట్టుకోసం పోతు గువ్వను పిలిచింది.

''అమ్మాయా పయిడిగువ్వ కూసింది, మీ మాటలు నిలిపి ఏదైనా పదము ఎత్తు కోండి,'' అనింది లచ్చుమవ్వ.

''అల్లమదేవి పదము వచ్చా మరదలా నీకు,'' అని సిరివన్నెను అడిగింది కెంపమ్మ.

''రాదు వదినె, అట్లా పదమును మా ఊర్లో ఎపుడూ విన్లేదే, ఏమి పదమది,'' తమికొని (ఆసక్తిగా) అడిగింది సిరివన్నె.

''అల్లమదేవి పదమే ఎరగనిదానివి నువ్వేమి మాదిగదానివే అమ్మాయా,'' ఓబమ్మ నోరు నొక్కుకొంటా అనింది.

''అడివికి ఆ తట్టు పల్లెలవాళ్లకు అల్లమదేవి పదము తెలియదులే. వాళ్లు పాడు కొనే కాళవ్వ పదము మనకు తెలుసునా ఏమి,'' అని సిరివన్నెను వెనకేసుకొని వచ్చింది లచ్చుమవ్వ.

''ఇంతకీ అల్లమదేవి కత ఏమి, చెప్పవా,'' లచ్చుమవ్వని అడిగింది సిరివన్నె.

''ముందుగా కత చెప్తాను వినుకో బిడ్డా, అనెంక పదము వింటువు,'' అని అల్లమదేవి కతను ఎత్తుకొనింది లచ్చుమవ్వ.

మన మాదిగ ఇండ్లలో పుట్టిన గొప్ప అందకత్తె అల్లమదేవి. బానము (నింగి)లో ఎగిరే గువ్వయినా నీళ్లలో మీజే (ఈదే) చేపయినా రవంత పొద్దు నిలిచి అయమ్మను చూసే పొయ్యేవి. అంత అందకత్తె ఆ తల్లి. ఆయమ్మ మొగుడు సుడుకాడు (వల్లకాడు)కు కాపలా కాసే మహేంద్రుడు.

మూడు పయిడివాకిళ్లూ మూడు వెండివాకిళ్లూ ఒక మానువాకిలీ మొత్తం ఏడు వాకిళ్లు ఉండే నగరు (అంతఃపురము)లో కాపురము ఉండేది అల్లమదేవి. ఆయమ్మకు ఏడుగురు దాదులు. ఒకనాడు ఏడుగురు దాదులూ ఏడు పయిడి బిందిగలను ఎత్తుకొని నీళ్లు తెచ్చేకి ఏటికి పొయిరి. అదే పొద్దుకు కోరమీసం వెంకట్రమణప్ప వేటాడి వేటాడి నీళ్ల దప్పి అయి నీళ్ల కోసరము అదే ఏటికి వచ్చినాడు. పయిడి బిందిగలలో నీళ్లు ముంచుకొని పోతా ఉండే దాదుల్ని చూసి, వాళ్ల దోవకు అడ్డము నిలిసినాడు.

''ఎవతే మీరు, పయిడి బిందిగిలతో నీళ్లకు వచ్చిండారు?'' అని నిలేసి అడిగినాడు. దానికి వాళ్లు అల్లమదేవి దాదులము అని చెప్పిరి.

''ఎవతే ఆ అల్లమదేవి, ఏమి దాని వయినము?'' తిరగా అడిగినాడు వెంకట్ర మణుడు.

''విడు దొరా, నగరుకు పోయే పొద్దాయె,'' అని ఎట్లో తప్పించుకొని పొయ్యేసిరి దాదులు.

అపుడు ఆ యప్ప అల్లమదేవి ఎవరని పారే ఏటిని అడిగినాడు, ఏరు మారు పలకలేదు. ఎగిరే గువ్వని అడిగినాడు, గువ్వా పలకలేదు. మీజే చేపని అడిగినాడు, చేపా పలకలేదు. అపుడు ఒక ఎనుము పోతు నీళ్లు తాగేకి ఏటి తావుకి వస్తే దానిని అడిగినాడు. ఆ ఎనముపోతు అల్లమదేవి గురించి అంతా చెప్పింది. అట్లా అందకత్తెను చూసే చూడాల అనుకొన్నాడు వెంకట్రమణప్ప.

''ఆ పాడయిపొయిన ఎనుముపోతు ఏల చెప్పెనో,'' తొప్పర (బాధ)పడతా అనింది ఓబమ్మ.

''దానికే కదా ఈ పొద్దుకూ ఎనుముపోతునే గావు (బలి) ఇస్తా ఉండేది మనము,'' కనలు (కోపం)గా అనింది కెంపమ్మ. వాళ్ల మాటలు అయినంక తిరిగి కతను కొనసాగించింది లచ్చుమవ్వ.

అనుకొనిందే తడువు దాసరయ్య వాలకము (వేషం)తో, చేత నెమిలిగరులు పట్టుకొని, జేగంట కొడతా అల్లమదేవి నగరు ముందుకు పొయి బిచ్చెము అడిగినాడు. అల్లమదేవి దాదుల చేత బిచ్చెము అంపించింది. 'ఆ బిచ్చెము నాకొద్దు మీ దొరసానినే వచ్చి వెయిమను,' అన్నాడు దాదులతో దాసరయ్య. సరేనని అల్లమదేవే వచ్చి బిచ్చెము వేసిపొయింది. ఆయమ్మ అందానికి వెంకట్రమణప్ప బిత్తరపొయినాడు. ఆ యప్పకు రెప్ప పడలేదు, నోట్లో మాట రాలేదు. చానా పొద్దు బెప్పరపొయి అట్లే ఉండిపొయినాడు.

ఆ పొద్దు రెయ్యంతా ఆ యప్పకు కంటిమింద కునుకేలేదు. కన్ను మూసినా తెరిసినా అల్లమదేవే కన పడతా ఉండాది. ఒక్క రెయ్యి అయినా అల్లమదేవిని పొందాల అనే చెడ్డ ఎన్నము(ఆలోచన) పురుగై తొలిచేసింది వాని బుర్రను.

''అయ్యో పాపి ముండాకొడుకు. పెండ్లయి ఉండే ఆడదాన్ని కోరినాడా! ఎట్లా చెడ్డ ఎన్నమోడమ్మా ఆ యప్ప,'' అనింది వెక్కసంగా సిరివన్నె.

''కండ్లల్లో పట్టడు పట్టడు పట్టడు పచ్చకొవ్వు పట్టిన వానికి తల్లికీ వేరిమి (తేడా) తెలిసేది లేదు. ఇంక పెరవాని పెండ్లాము ఒక లెక్కా బిడ్డా,'' కెంపమ్మ కనలుగా అనింది.

''అనెంక ఏమాయెనవ్వా?'' అడిగింది సిరివన్నె.

''ఏమాయెనంటే కారానిదే అయింది. తిరగా తెల్లవారినంక అదే ఏటితావుకు పొయినాడు వెంకట్రమణప్ప. అల్లమదేవి దాదులు నీళ్లకు వచ్చిరి. అల్లమదేవి పొందు కావాలనీ, ఒక్క రెయ్యి అయినా చాలనీ దాని కోసరము ఏమి చేయుమన్నా చేస్తాననీ దాదుల్ని బతిమాలుకొన్నాడు, వాళ్లకు కాసుల ఎర చూపించినాడు. ఆరుగురు దాదులు లొంగలేదు. కడసీ దాది కాసులకు లొంగిపొయింది.

''వెంకట్రమణప్ప ఇచ్చిన మల్లెపూలమాలను తామరాకులో పొట్లం కట్టుకొనింది. మరులమందును నూరి వక్కాకులో చుట్టుకొనింది. పొద్దు మునిగినంక నగరుకు పొయింది. అపుటికే మహేంద్రుడు సుడుకాడు కావిలికి పొయ్యేసినాడు. దాదులు అందరూ నగరును అంతా చక్కపెట్టి ఇండ్లకు తిరుక్కొనిరి. అల్లమదేవి ఒకటే నగరు వాకిళ్లు మూయపోతా ఉండాది.

"అదే పొద్దుకు ఏడో దాది నగరు వాకిలి తావుకు పొయింది. దానిని చూసిన అల్లమదేవి, 'ఏలే తెల్లవారి నించీ రానేలేదు, ఇంత పొద్దులో వచ్చిండావు ఏమి కత,' అని అడిగింది.

'అయ్యో ఏమి చెపుతును అమ్మా. ఈ పొద్దు తెల్ల వారి మా అత్తను పులుగు ముట్టింది (పాము కరిచింది). ఆ ఊరు ఈ ఊరు తిరిగి ఆ మందు ఈ మందు తెచ్చి ఇచ్చి మేలు చేసేతలికి ఇంత పొద్దు అయింది. ముసిలి దాన్ని చూసేకి చుట్టాలు అందరూ వచ్చి ఇల్లు నిండిపా యిండాది. ఈ పొద్దు రెయ్యి నీకు తోడుగా ఈడ్నే పండు కొంటాను దొరసానీ,' అని బొంకింది.

'సరే వాకిళ్లన్నీ వేసుకోని రా,' అంటా నగరు లోపలకు పొయింది అల్లమదేవి.

"రెయ్యి కూడు తినినంక అల్లమదేవి తావుకు మెల్లగా వచ్చింది దాది. 'అమ్మా మా ఇంట్లో పూసిన మల్లె పూలతో మాల అల్లితిని, పెట్టుకో అమ్మా,' అంటా వెంకట్రమణప్ప పంపిన మాలను అల్లమదేవి తలలో ముడిసింది. ఆ పూలలో ఏమి మాయ పెట్టి అంపినాడో, గమ్ములు (వాసన) తగలతానే ఒక మంపుర (మత్తు) కలిగింది ఆయమ్మకు. అనెంక మరులమందును పెట్టిన వక్కాకును అల్లమదేవి నోటికి అందించింది. ఆ వక్కాకు నమిలిన ఆ తల్లికి మంపుర ఇంకా తలకు ఎక్కింది. ఆ మంపురలో ఆ తల్లి సొక్కుతా ఉండగానే నడిరెయ్యి అయ్యింది. దాదిది లేసి దీపాలను మలిగిం చింది. ఏడు వాకిళ్ల గడులు తీసింది. వాకిళ్లకు అవతల ఉండే వెంకట్రమణప్ప మెల్లిగా నగరులోకి దూరినాడు. ఏపుగా ఎదిగిన రాగిచేనులోకి దొంగగొడ్డు దూరుతుందే అట్లా దూరినాడు.

"అయ్యయ్యో, ఆ దాది ముండ ఎంతపని చేసే సిందమ్మా, అనెంక ఏమాయె," ఆత్రంగా అడిగింది సిరి వన్నె.

"అక్కడ సుడుకాడులో కావిలి తిరుగుతా వుండాడు మహేంద్రుడు. తిరిగి తిరిగి ఒక తబిసిమాను కింద రవంతసేపు కన్ను కొరికినాడు. అంతలోగా ఉత్తుత్తి గువ్వలు కెర్లినాయి. ఉలిక్కిపడి లేసినాడు. గుగ్గుగ్గుక్... అంటా గూబ ఒకటి ఆ యప్ప తలమింద తన్నేసి పొయింది. మానుపిల్లి ఒకటి 'మావ్' అంటా మహేంద్రుడి కాళ్ల సందున దూరి పారిపొయింది. ఏదో కీడు జరగపోతా ఉండాదని అనిపించింది ఆ యప్పకు. తబిసి మానుని దాటి నగరు తట్టు అడుగులు వేసినాడు మహేంద్రుడు.

"నగరులో జరగరాని తప్పు జరిగిపోతా ఉండాది. మరులమందూ మాయ మల్లెలు తెచ్చిపెట్టిన మంపుర లో, మలిగిన దీపాల మసక మబ్బులో తన తావుకు వచ్చింది తన మొగుడే అనుకొనింది ఆయమ్మ. తనని దగ్గరకు తీసుకొనింది మహేంద్రుడే అని తలచింది. తన ఒళ్లు అంతా ఆ యప్పకు అప్పగించేసింది.

"పని ముగించుకొన్న వెంకట్రమణప్ప నగునగతా పైకి లేచి పంచె కట్టుకొన్నాడు. దాది వచ్చి దీపాలను పెద్దవి చేసింది. కోరమీసం దువ్వుకొంటా బయలుదేరి నాడు వాడు. అప్పుడు ఒళ్లు తెలిసింది అల్లమదేవికి. మీసం దువ్వుకొంటా వాకిలి దాటతా ఉండే వెంకట్ర మణప్పని చూసింది. తప్పు జరిగిందని తెలుసుకొనింది ఆ తల్లి. ఎన్నడూ నగరు దాటి ఎరగని ఆ యమ్మ వాకిళ్లన్నీ దాటి సుడుకాడు పక్కకు పరుగెత్తింది.

"దోవలోనే ఎదురుపడినాడు మహేంద్రుడు. మొగున్ని పట్టుకొని కంటికి కడవడు నీళ్లను కార్చింది అల్లమదేవి. జరిగింది తెలుసుకొన్నాడు మహేంద్రుడు. లోన ఏ మైలా లేనప్పుడు ఒంటికి మైల అంటదు అని అల్లమదేవిని ఓదార్చినాడు. పెండ్లాన్ని ఇంటికి పొమ్మని చెప్పి కత్తి ఎత్తుకొని వెంకట్రమణప్ప మిందకి కయ్యానికి పొయినాడు. కయ్యములో వాన్ని సొలిపించి (ఓడించి) నూరారు ఆమడల దవ్వుకు తరిమేసినాడు. బిరబిరా ఇంటికి వచ్చినాడు. ఇంట్లో అల్లమదేవి లేదు.

"ఆయమ్మ సుడుకాడు పక్కకు పరుగెత్తి పొయిం దని, చూసిన కోడిపుంజు పలికింది. సుడుకాడుకు పరు గెత్తిపొయినాడు. అక్కడ ఆ సుడుకాట్లో తబిసిమాను కింద ఆ తల్లి రాయిగా మారిపడి ఉండాది. ఆ రాయిని పట్టుకొని ఏడిసినాడు మహేంద్రుడు, ఆ రాయికి తలను కొట్టుకొన్నాడు మహేంద్రుడు, కడసీకి తానూ ఆ రాయి పక్కనే ఇంకొక రాయి అయిపొయినాడు మాహేం ద్రుడు," కళ్లు తుడుచుకొంటా కతను నిలిపింది లచ్చు మవ్వ.

కతను విన్నవాళ్లంతా కూడా కళ్లు తుడుచు కొన్నారు. సిరివన్నె అయితే బోరున ఏడిచేసింది. కెంపమ్మ సిరివన్నెను ఒడిలో పండుకో పెట్టుకొని వీపు నిమురుతా, "వాళ్లు ఇద్దరూ ఇపుటికీ బతికే ఉండారట. రెయ్యిపూట రెయ్యమ్మే కునికే చిటికంత పొద్దులో రాళ్లయిపొయిన వాళ్లిద్దరూ మనుసులుగా మారుతా రంట. మన మాదిగ పల్లెలకు ఏ ముప్పు జరగకుండా కాపు కాస్తా ఉంటారంట," అంటా ఓదార్చింది.

కతను కడవరకూ వినిన రెయ్యమ్మ తను పోతా పోతా పగటమ్మకు చెప్పింది. పగటమ్మ కూడా ఏడిచి

ఏడిచి ఎర్రబారిన కళ్లను తెరిచింది. తూరుపు మిన్నంతా ఎర్ర బారిపొయింది. కసువులు కళ్లాపులు ముగించుకొని అమ్మలక్కలు నలుగురూ కలిసి బిందెలు చెరవలు ఎత్తుకొని చెలమబాయి దగ్గరకు బయదేలినారు. తిరిగెన (రాట్నము) లేని నేలబాయి అది. బాయికి నట్టనడు మన ఆదరి ఈదరిని తాకతా ఒక కొయ్యి ఉంటాది. సిరి వన్నె ఒక కాలును కొయ్యమింద, ఒక కాలును గట్టు మింద పెట్టి, చేంతాటి ఒక కొసతో చెరవ గొంతుకు ఉచ్చుముడి వేసి మెల్లగా చెరవను బాయిలోకి విడిచింది. నిండిన చెరవను పైకి చేది నీళ్లతో బిందెలను నింపతా ఉండాది.

కోరమీసాలతో ఎర్రకన్నులతో నోట్లో వేపకడ్డిని నములుతా ఒక ఆయన బాయి దగ్గరకు వచ్చి, ''కెంపీ మా ఆవుదూడ తప్పించుకొనింది. ఇట్ల ఏమన్నా వచ్చిందా,'' అన్నాడు.

''ఏల నాగరాజప్పా, మీ ఊర్లో ఏ గొడ్డు తప్పి పొయినా ముందు మా మాదిగ పల్లేనా మీకు కనపడేది,'' రవంత వెక్కసంగా అనింది కెంపమ్మ.

''ఏల కెంపీ యెక్కసము, ఇట్లేమన్నా వచ్చిందేమో అని వస్తిని, అదీ తప్పేనా! సరే, ఈ పడుచు ఎవురు కొత్తగా తెలుస్తా ఉండాదే,'' అన్నాడు వంగి నీళ్లుచేదతా ఉండే సిరివన్నెను చూస్తా.

''మా చెన్నీరడి పెండ్లాము. ఈ నడుమనే పెండ్లయి వచ్చిండాది,'' చెప్పింది ఓబమ్మ.

సిరివన్నెనే ఆబగా చూస్తా నోట్లోని పుల్లను తుపుక్కున ఉమిసి, బాయి దగ్గరకు వచ్చి, ''రవన్ని నీళ్లు పొయి అమ్మాయా,'' అన్నాడు నాగరాజు.

''ఏమప్పో ఎన్నడూ లేనిది మా మాదిగబాయి నీళ్లు అడగతా ఉండావే,'' మద్దూరమ్మ అడిగింది.

''నీళ్లకు అంటు ఏముందిలే మద్దూరక్కా,'' అన్నాడు వంకర నగవు నగతా నాగరాజు.

''అట్టయితే మీ కాపుపల్లె బాయి నీళ్లకు మేమూ రావచ్చునా,'' చురుగ్గా అడిగింది కెంపమ్మ.

ఆ అడకకు మారు పలకలేక అట్లే నిలబడి పొయి నాడు ఆయప్ప. నలుగురూ నిండిన బిందెలను చంకలకు ఎత్తుకొని చెరవలను చేత పట్టుకొని కదిలినారు.

''ఏలక్కా, పాపము ఆయప్పకు నీళ్లు పోసింటే ఏమి,'' అడిగింది సిరివన్నె.

''కలకుండు (ఊరకుండు) అమ్మాయా.వాడు నంజుపులుగు (విషపురుగు) వాడేమన్నా నీళ్ల కోసరము వచ్చెనని అనుకొంటా ఉండావేమో. వానికి ఆడది కన పడితే సాలు, జొల్లు కారుస్తాడు,'' అనింది ఓబమ్మ.

''అవును బిడ్డా. వానిది మన ఊరికి తూరుపు తట్టు పదితాడుల దవ్వులో వుండే ఊరు. వాని పేరు నాగరాజు. కాపోళ్ల కడుపున పుట్టినోడు. ఆ ఊర్లో వాని కంటికి నదురు గా కనపడిన ఆడదంతా వాని పక్కలో పండుకోవాల. లేదంటే నాగుపాము సలపెట్టి నట్లు సల పెట్టి ఆ కాపురాన్ని అణిచేస్తాడు, దొంగనాబట్ట. ఇంత వరకూ వాని చూపు మన మాదిగపల్లె మింద పడలేదు. ఏమిటికో ఈ పొద్దు ఇట్ల వచ్చిండాడు. మనము రవంత మెలకువగా ఉండాల,'' మద్దూరమ్మ అనింది.

''ఓ ఏమి నువ్వు చెప్పేది, ఇదేమి వాడు బతికే ఊరట్లా చెడిన ఊరుకాదు, మన మాదిగపల్లె తట్టు రానీ చూడు, వాని కత ఏమయితుందో,'' గట్టిగానే అనింది కెంపమ్మ.

మద్దూరమ్మ సరిగ్గానే తలపోసింది. ఈ పదినాళ్ల లోనే సిరివన్నె అందము ఆనోటా ఆనోటా పడి మాదిగ పల్లెను దాటి నాగరాజు చెవినపడింది. సిరివన్నెను చూసి పొయ్యే దానికే ఆ పొద్దువాడు మాదిగపల్లెకు వచ్చినాడు.

ఇది జరిగిన రెండోనాడు నడిపొద్దులో చేను తావుకు పొయి మొగునికి సంగటి పెట్టి తిరిగివస్తా ఉండాది సిరివన్నె. జొన్నసొల్ల నడుమ నుంచి ఇవతలికి వచ్చి సిరి వన్నెకు ఎదురుగా నిలిచినాడు నాగరాజు. ఆ పొద్దులో ఆ తావున వాడిని చూసి గతుక్కుమనింది సిరివన్నెకు.

''అమ్మాయా నీ కోసరము పేటనించి గాజులు తెస్తిని, ఇదిగో యేసుకో,'' అంటా మట్టిగాజులను కళ్ల ముందు పెట్టి గలగలలాడించినాడు.

''నాకేమీ వద్దు, దోవకు అడ్డము లెయ్యన్నో పోవాల,'' అనింది సిరివన్నె.

''పోదువులే అమ్మాయా. ఈ ఒక్క మాట వినిపో. నేరుగా చెప్పేస్తా ఉండా. నీ మింద నాకు కోరిక అయింది. నీ పొందు కావాలని నా ఒళ్లు తపన పడిపోతా ఉండాది. నా కోరిక తీర్చినావంటే మట్టిగాజులు ఏమిటికి, నీ చేతులకు బంగారుగాజులే వేస్తాను,'' అన్నాడు నాగరాజు.

''ఇట్ల మాట్లాడేది నీకు సరిపొయిందా అన్నా. పెండ్లయిండే ఆడది, తల్లి మాదిరే అంటారే,'' పొంగి వస్తా ఉండే ఏడుపును మింగతా అనింది సిరివన్నె.

''బాగా తలపొయ్యి. నీకు కావలసిండేవి అన్నీ అమర్చి పెడతాను. ఎవురికీ తెలియకుండా గుట్టుగా నడిసిపోతాది అంతా,'' తిరిగి అన్నాడు వాడు.

''నా మొగునికి తెలిస్తే నిన్ను పెట్టేలేదు. మరేదగా నన్ను పోనీయి,'' బెదిరింపుగా అనింది ఆమె.

"వాని మొకము. వాడు నన్నేమి చేస్తాడు. ఈ సుద్ది బయట ఏడన్నా పొక్కిందో, రెయ్యి మంచె దగ్గర ఒంటిగా ఉండే నీ మొగున్ని నేనే చంపేస్తాను. మొగుడు సచ్చి ముండమోసినంక నా తావుకు వస్తావో, ముత్తయిదుగా ఉండి వస్తావో తేల్చుకో," అనేసి పొయ్యేసినాడు నాగరాజు.

ఒక్క పరుగున ఇల్లు చేరింది సిరివన్నె. చానాసేవు ఆ బిడ్డకు గుండె దడ తగ్గ లేదు. ఏమి చేయాలో తెలియ లేదు, ఎవరికన్నా చెప్పొచ్చో లేదో కూడా తెలియలేదు. చెపితే చెన్నీరడిని ఏమన్నా చేసేస్తాడేమో అని దిగులు పుట్టేసింది. దాంతో జరిగినదాన్ని తన లోపలే అదుము కొనేసింది.

అంతటితో ఆగిపోలేదు నాగరాజు. రెండునాళ్లకు ఒకసారి ఒంటరిగా ఉన్నప్పుడు చూసి అడ్డము పడతానే ఉండాడు. సిరివన్నెకు నాగరాజును ఎట్ల తప్పించుకో వాలో తెలియలేదు. దిగులు పడిపోయింది. పది పదైదు నాళ్లుగా సిరివన్నె ఒక మాదిరిగా ఉండేదాన్ని కెంపమ్మ గమనించింది. ఒకనాటి రెయ్యి ఎవరూ లేకుండా ఒకటే సిరివన్నె ఇంటికి పొయింది. ఆపాటికే చేను తావుకి పొయ్యేసి ఉండాడు చెన్నీరడు.

"రా వదినె, ఏల ఇంత పొద్దులో వచ్చిండావు," అంటా లోపలికి పిలిచింది సిరివన్నె కెంపమ్మను.

లోపలకు పొయి సిరివన్నెకు దగ్గరగా కూచుని, "సిరీ నేను అడిగే దానికి నిక్కము చెప్పాల. లేకపోతే నేను చచ్చినంత ఒట్టు," అనింది కెంపమ్మ.

ఏమిరా ఇది అని దిగులు పడతానే, "అడుగు వదినె," అనింది సిరివన్నె.

"మా తమ్ముడు నిన్ను బాగా చూసుకొంటాలేడా," అడిగింది కెంపమ్మ.

"ఏల వదినె అట్ల అడుగుతావు. మీ తమ్ముడు నన్ను పువ్వుల్లో పెట్టి చూసుకొంటా ఉండాడు," చెప్పింది సిరివన్నె.

"మరి పదినాళ్లుగా ఏల అట్ల ఉండావు, లోగా ఉండే తొప్పర ఏమో బయటపెట్టు," తిరిగి అడిగింది. ఆ మాటతో అన్నాళ్లుగా అదిమి పెట్టుకొన్న ఏడుపు కట్టలు తెంచుకొని బయటపడింది సిరివన్నెకు. కెంపమ్మను తబ్బుకొని వెక్కివెక్కి ఏడస్తా నాగరాజు సంగతి అంతా చెప్పింది.

అంతా వినిన కెంపమ్మ, "ఆ నా బట్ట కండ్లు నీ మింద పడినాయా, నాతో ఆ పొద్దే ఏల చెప్పలేదు, వాన్ని పరక (చీపురు) యేట్లు యేసి తరిమి ఉంటునే," కనలుగా పలికింది.

"వదినె, ఇది బయటకు తెలిస్తే నలుగురిలో నగు బాట్లు కాదా. పైగా వాడు ఒంటిగా ఉండే మీ తమ్ముడిని ఏదయినా చేస్తే," దిగులుగా పలికింది సిరివన్నె గొంతు.

"అవును బిడ్డా ఈ సుద్ది మన మొగుళ్లకు తెలియ కూడదు. ఉండు ఓబినీ మద్దూరినీ పిలుసుకొని వస్తాను. మనము నలుగురుమే దీనిని ఎట్లయినా తెంచాల," అంటా పొయి మిగిలిన ఇద్దరినీ పిలుచుకొని వచ్చింది కెంపమ్మ. ఆ రెయ్యి ఆ నలుగురు ఆడవాళ్లు చానా పొద్దు వరకూ మాట్లాడుకొన్నారు.

'మాదిగపల్లె ఆడోళ్లు అంటే సలిచీమలు అను కొన్నాడేమో, ఏనిగనే తరిమే ఎర్ర చీమలట్లా వాళ్లని తెలియలేదు వానికి. రేపు రెయ్యి తెలుస్తుందిలే," నగతా అనింది కెంపమ్మ.

సిరివన్నె తెల్లవారి లేచి పనులన్నీ చక్కచేసుకొని నడిపొద్దుకు సంగటీ చారూ చేసుకొని ఒంటిగా చేను తావుకి బయదేలింది. నాగరాజు కోసము నాలుగు పక్కలా చూసుకొంటా పోతా ఉంది. సంపంగిరాముని చేను దాటిన తరువాత వచ్చే కానుగ మాన్ల కింద కనపడి నాడు వాడు. సిరివన్నెను చూసి దగ్గరకు రాబోయేలోగా సిరివన్నే వాడికి ఎదురుపొయింది.

"ఏమి సిరీ ఏమి తలపోస్తివి," అన్నాడు సిరి వన్నెకు అడ్డంగా నిలపడి. వాడిని చూసి సిరివన్నె సిగ్గు పడింది. ఆ సిగ్గు చూసి వాడు మొగ్గయిపొయినాడు. "బాగా తలపోసి చూస్తిని. నువ్వు చెప్పిందే బాగుంది. ఈ పొద్దు నడిరెయ్యి దాటినంక మా ఇంటికి వచ్చెయ్యి," అనేసి వెనక్కు తిరిగి చూడకుండా పొయ్యేసింది.

ఇంక నాగరాజు కత చెప్పాల్నా! వాని ఇచ్చకానికి పట్టపగ్గాలే లేకుండా పొయినాయి. ఆ పొద్దు పగలంతా వాడికి ఆకలి కాలేదు, తవన ఒక ఏడుగా గడిచింది వాడికి. నడిరెయ్యిలో బయదేలి మాదిగపల్లెకు చేరినాడు వాడు. చెన్నీరడి ఇంటి ముందు నిలపడి మెల్లిగా వాకిలి నెట్టినాడు, తీసే ఉండాది. వాకిలిని తోసుకొని లోపలికి పొయి నాడు.

*

ఇప్పిమాను మింద నుంచి ఏనుగుల్ని చూసిన చెన్నీరడు, వెనక్కి పరుగెత్తినాడు. తన మంచె ఉండే తబిసిమాను తావుకు పోతాపోతా, "సంపగిరామా, మదనగిరీ, కలికి రామా, మాదేశా, చెక్కార్లుగా ఏనిగలు రా ఏనిగలు లెయ్యండిరా," అని కెరలినాడు. బిరబిర మంచెమిందకు ఎక్కి పలకనూ పటాసులనూ (టపా కాయలు) ఎత్తుకొని అంతే విరవిరగా మాను దిగినాడు.

ఆ అరుపులు వినిన చుట్టుపక్కల మంచెల మింద ఉండేవాళ్లంతా ఒక్క పరుగున తబిసిమాను తావుకు వచ్చేసి, "ఏ తావున వస్తా ఉండాయిరా," అని అడిగి నారు చెన్నీరడిని. "తంగిడికుంట దోవలో వస్తా ఉండాయిరా. చెక్కార్లప్ప చేనులోకి వచ్చేసి ఉంటాయి," ఎగూపిరితో అన్నాడు చెన్నీరడు.

అంతే అందరూ కలిసి పలకలు కొట్టుకొంటా కిలారిస్తా తంగిడికుంట తావుకు పరుగులు తీసినారు. ఆ పాటికే కుంటను దాటుకొని వచ్చి చెక్కార్లప్ప చేను లోకి దిగతా ఉండాయి ఏనుగులు.

"చెన్నీరా, నువ్వూ చెక్కార్లూ ఆ నలుగురినీ తోడు కొని చేనుకు తెక్కణం నుంచి రాండి, నేనూ మదనగిరీ మునెంకటన్నా మద్దూరప్పలము అట్ల పడమరకు పోతాము. మాదేశా, నువ్వూ కలికిరాముడూ పెద్దీరడూ ఈ తూరుపు నుంచే ఎగపడండి. వాటిని వక్కణంగా తరమాల," పలకల అలికిడి నడుమన అరస్తా అన్నాడు సంపంగి రాముడు.

"మేము పడమరకు పొయ్యే వరకూ పటాసులు కొట్టొద్దురో," మదనగిరి కెర్లినాడు.

పలచపడిపొయిన అడవుల్లో మేపులు దొరకక, కడుపులు నిండక, కడుపుడు మేత కోసం చేలమింద పడిన మనుములు ఒక పక్క, ఆరుకాలం గాసిపడి మొలిచిన పైరును పసిబిడ్డ మాదిర చూసుకొని, ఏడాది పాటు కాపురానికి కడుపునింపే పంటను కాపాడుకోవా లనే తపనతో మనుసులు ఒక పక్క- ఆ ఎక్కటి కయ్యం (ద్వంద్వయుద్ధం) మొదలు అయింది.

మూడుపక్కలకూ చెదిరి పలకలు కొడతా పటాసులు పేల్చినారు మనుసులు. వీళ్ల రాకని అప్పటికే గమనించి పిల్ల ఏనుగులను నడుమన నిలపెట్టి నాలుగుపక్కలా దడి కట్టినట్లు నిలిచినాయి పెద్ద ఏనుగులు. పలకల మోతకు ఎదురుసద్దు (ప్రతిధ్వని) లాగా వాటి గీంకారాలు మొదలయినాయి.

చేన్ల తావు నుంచి గాలిగుర్రం మింద ఎక్కి వచ్చిన పలకల మోతలు ఊరి వాళ్లను తట్టి లేపినాయి. "చేన్ల లోకి ఏనిగలు నుగ్గినట్లు ఉండాయి, జుంజులు (కాగడాలు) ఎత్తుకొని పదండ్రారేయ్," అంటా చేన్ల పక్కకు పరుగులు తీసినారు ఊర్లోవాళ్లు.

పిల్లల్ని గుంపుకు నడుమన నడిపించుకొంటా వక్కణపు పక్కకు కదిలింది ఏనుగుల గుంపు. నడుస్తా నడుస్తానే అప్పుడప్పుడూ ఏదయినా ఒక ఏనుగు వెనక్కి తిరిగి తొండం ఎత్తి ట్రుర్రో... అని కెర్లతా ఉండాది. 'మా కడుపులు కొడతా ఉండారు ఏలరా, మా బిడ్డలకన్నా అంత మేపును ఇయ్యండి రా,' అన్నట్లు ఉండాయి ఆ అరుపులు.

ఇరవయి ముప్పయి అడుగుల ఎడంగా వుంటానే వాటిని తరమతా ఉండారు వాళ్లు. పది అడుగులకు ఒక తావున పటాసులు కొడతా ఉండారు.

ఉన్నెట్లే ఉండి, పోతా ఉండే గుంపులో నుంచి చిన్న గున్న ఒకటి విడిపడి తూరుపు తట్టుకు దిగపడింది. ఇంకొక ఇరవయి అడుగులు పొయినంక ఆ గుంపులోని గున్నతల్లి, తన పిల్లలేదని చూసుకొన్నట్లు ఉంది. అంతే, ఒగ్గాళంగా అరస్తా వెనకకు తిరుక్కొనింది.

ఏనుగుల గుంపును తరిమేటప్పుడు వాటి గుంపు చెదిరిపోకుండా తరమాల. గుంపులో నుంచి ఏదయినా ఒకటి చెదిరి ఒంటిగా వచ్చిందా, తన గుంపుకు ఎడ మయిన దిగులుతో వెర్రి పట్టినట్లు పరుగులు తీస్తుంది అది. పిల్ల ఏనుగు వెనక వచ్చిన తల్లి ఏనుగు అయితే ఇంక చెప్పాలసింది లేదు. అట్లా ఏనుగుల కాళ్ల కింద పడే ఉసురులు పోతుంటాయి.

"మాదేశా వెనిక్కి తగ్గురా, గుంపునించి విడిపోయి తల్లీ పిల్లా ఇట్లే వస్తా ఉండాయి," అరిచి చెప్పినాడు కలికిరాముడు. అదే పొద్దుకు తెక్కణం నుంచి జుంజు లతో ఆ తావుకు ఊరివాళ్లు వచ్చినారు. జుంజుల వెలుగును చూపిన గున్న ఏనుగు ఇంకా దిగులు పడి నట్లుంది. తూరుపు తట్టుకు వడిగా దూసుకొని వచ్చింది. దానిని కాపుకాస్తా దాని తల్లి కూడా వెనుకనే వచ్చేసింది.

దిగుడుదోవలో తప్ప, ఎక్కుడులోకానీ చదునులో కానీ ఏనుగు పరుగును మనిసి తప్పించుకోలేడు. అయినా గిరుక్కున వెనిక్కి తిరిగినారు మాదేశుడూ పెద్దీ రడూ. కలికిరాముడు వంగి పటాసులను కాల్చపొయి నాడు. అంతలోపలే దగ్గరకు వచ్చేసినాయి అవి రెండూ. లేచి వడిగా పరిగెత్తపోతా కాలికి రాయి తగిలి తూలి ముందుకు పడినాడు కలికిరాముడు. మాదేశుడూ పెద్దీరడూ ఇది చూడకుండా పరిగెత్తి పొయ్యేసినారు.

జుంజుల వెలుగులో ఇదంతా చూసిన చెన్నీరడు, దిడీలున జుంజును ఒకదాన్ని లాక్కొని తవనలో ఆ తావుకు వచ్చి ఆ తట్టు నుంచి ఏనుగు మిందకు జుంజును విసిరినాడు. దాంతో కలికిరాముడిని విడిచి పెట్టి చెన్నీరడి పక్కకు తిరిగింది ఆ ఆడఏనుగు. కోపంతో పెద్దగా గీంకరించి వడిగా వాడి మిందకు పరుగెత్తింది.

"చెన్నీరా మెలపు రా," అంటా వెనక నుంచి సంపంగి రాముడు అరిచినాడు.

''నంజుండేశా జుంజును చెన్నీరడి చేతికి విసి రెయ్యి రా,'' చెన్నీరడికి పదడుగుల దవ్వులో జుంజు పట్టుకొని నిలుచుకొని ఉండే నంజుడేశుని చూస్తా అరిచినాడు చెక్కార్లప్ప.

నంజుండేశుడు జుంజును చెన్నీరడి పక్కకు విసిరి, పరుగులు తీసినాడు. చెన్నీరడు ఆ జుంజును ఎత్తుకొని ఏనుగుకు చూపతా వెనక్కు తిరిగినాడు.

''రేయ్ ఒకేసారి తూరుపుతట్టు తెక్కణపుతట్టు పటాసులు పెట్టండిరో, వక్క ణంగా ఎవురూ నిలవద్దు, దానికి దోవ విడవండి,'' మదనగిరి కెర్లతా చెప్పినాడు.

ఆ మాటతో చెన్నీరడి వెనకనే పటాసులు మోగినాయి. అదే పొద్దుకు ఆ పక్క తూరుపు తట్టున కూడా కలికిరాముడు పటాసులు కాల్చినాడు. ఆ పటపటలు విని గున్న వక్కణానికి తిరుక్కొనింది. తల్లి ఏనుగు గున్నను వెంబడించింది. అట్లే తరుముతా తరుముతా ఆ రెండిటినీ తంగిడికుంటను దాటించినారు

వాళ్లు. కుంట దాటినంక అవి రెండూ వెనకకు తిరగకుండా పారిపొయి అడివి లోని వాటి గుంపులో పడినాయి.

అప్పటికి నెమ్మది పడిన మాదిగపల్లె మగవాళ్లు, కుంటలో దిగి మొకాలు కడు క్కొన్నారు. ఇదంతా జరగతా ఉండగానే ఏమీ ఎరగనట్లు తూరుపున చుక్క పుట్టి వెలుగయింది. ఆ వెలుగులో వేపకడ్డి కోసము కుంటకు ఆ పక్కకు పొయిన పెద్దీరన్న, ''చెన్నీరా,'' అంటా వెర్రికేక పెట్టినాడు. కేకను విని ఆ పక్కకు పరుగులు తీసిన నలుగురికీ, మొకమంతా నలిగిపొయి పడుండే పీనుగ ఒకటి కనపడింది అక్కడ.

''అయ్యో ఏనిగలు వచ్చేటపుడో పొయ్యేటపుడో ఎవుర్నో తొక్కి సంపేసినాయి కొడుకా,'' అన్నాడు పెద్దగా పెద్దీరన్న.

తెల్లంగా తెల్లవారినంక ఆ పీనుగ కాపుపల్లె నాగరాజుది అని కనిపెట్టినారు వాళ్లు. నాగరాజుగానికి మాదిగపల్లె దగ్గర ఉండే తంగిడి కుంట తావున ఏమి పని పడిందో తెలియలేదు ఎవరికీ. నాగరాజు సొంత మోళ్లు వచ్చి పీనుగను ఎత్తుకొని పొయినారు.

'మాదిగపల్లె మింద కన్నేసినాడంట. అందుకే అల్లమదేవి ఏనిగ మాదిర వచ్చి తొక్కి సంపేసిందంట నాగరాజుని,' అనే పొక్కిపోవిడి (వదంతి) ఒకటి ఆ చుట్టుముట్టు పల్లెలంతా తిరిగి వచ్చింది. దానిని పుట్టించిన కెంపమ్మ కడుపుబ్బా నవ్వుకొనింది.

సుడుకాడులో తబిసిమాను కింద రాళ్లరూపులో ఉండే అల్లమదేవీ మహేంద్రుడూ కసితీరా నగుకొన్నారు.

*పాలపిట్ట మాసపత్రిక, ఫిబ్రవరి 2013*

